పిడికిలెత్తి జై కాసాని.. అంటున్న వృద్ధుడు

కాసానిదే జయం.. జనమే సాక్ష్యం | చేవెళ్లలోని ఫరా ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు అశేషంగా తరలివచ్చిన ప్రజలు..

చేవెళ్ల.. కాసాని ఖిల్లా!

జననేత కేసీఆర్ ప్రసంగం వినేందుకు తరలొచ్చిన అశేష ప్రజానీకం • దారులన్నీ గులాబీమయం

నేతల సమన్వయం.. చేవెళ్లలో ప్రజా ఆశీర్వాద సభ జయప్రదం

బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల తొలి ప్రచార సభ సూపర్ హిట్

రంగారెడ్డి, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): తండోప తండాలుగా తరలివచ్చిన ప్రజానీకం. సభా ప్రాంగణంలో ఇసుకేస్తే రాలనంత జనం. రోడ్లపై గులాబీ వనంలా పరుచుకున్న జనసందోహం. ఇదీ చేవెళ్ల బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్‌కు నిదర్శనం. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన తొలి సభ విజయవంతమైందనడానికి సజీవ సాక్ష్యం. చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో శనివారం గులాబీ దళం ఎన్నికల రణభేరి మోగించింది. తరలివచ్చిన అశేష ప్రజానీకం నీరాజనం పలికింది. ఫరా ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రభంజనం సృష్టించారు. చేవెళ్ల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి యువకులు, మహిళలు, ముస్లిం మైనారిటీ, వృద్ధులు, వర్తక, వ్యాపారులు, సబ్బండ వర్ణాలు తరలిరావడంతో సభా ప్రాంగణంతోపాటు పరిసర ప్రాంతాలన్నీ జన సంద్రమయ్యాయి. ఊర్లకు ఊర్లే ఉదయాన్నే ఇల్లు కదిలి దండులా రావడంతో ఏడు నియోజకవర్గాల్లోని ప్రజానీకం ఆసాంతం తరలివచ్చినట్టుగా కనిపించింది. పెద్ద సంఖ్యలో తరలివచ్చి బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ విజయం ఖాయమైందన్న భావనను కల్పించారు. అశేష జన ప్రవాహంతో సభకు వచ్చే దారులన్నీ గులాబీమయమయ్యాయి. సభ ప్రాంతంలోనూ ఫ్లెక్సీలు, గులాబీ జెండాలు రెపరెపలాడాయి. ఊహించిన దానికంటే గ్రాండ్ సక్సెస్ కావడంతో ఈ సభ బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపింది.

కిక్కిరిసిపోయిన రహదారులు

కేసీఆర్ సభ సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభం కాగా.. మధ్యాహ్నం 3 గంటల నుంచే ప్రజలు రాక మొదలైంది. ఐదు గంటలకే సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోయింది. ఉప్పెనలా జనం తరలిరావడంతో సభా ప్రాంగణం బయటే వేలాది మంది ఉండాల్సి వచ్చింది. హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రహదారి, కంది హైవేతోపాటు చేవెళ్ల శివారు ప్రాంతాలన్నీ జనంతో కిటకిటలాడాయి. కేసీఆర్ ప్రసంగాన్ని వినాలన్న ఆసక్తితో చాలా మంది వాహనాలు దిగి కిలోమీటర్ల మేర నడుచుకుంటూ సభ ప్రాంగణానికి రావడం కనిపించింది. పిల్లా పాపలతో మహిళలు, వృద్ధులు, యువత, రైతులు సైతం భారీ సంఖ్యలో తరలివచ్చారు. సభలో సీఎం కేసీఆర్ ప్రసంగం ఆద్యంతం ప్రజలను ఆకట్టుకున్నది. అరగంటకుపైగా సాగిన కేసీఆర్ ప్రసంగాన్ని జనం ఆసక్తి ఆలకించారు. పదేండ్లపాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని కేసీఆర్ ప్రజలకు వివరించారు. హస్తం పార్టీకి అవకాశం ఇస్తే ఈ కొద్ది రోజుల పాలనలోనే జరిగిన నష్టాన్ని విశదీకరించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో గట్టి షాక్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ప్రసంగం సాగుతున్నంత సేపు 'జై కేసీఆర్.. జై జ్ఞానేశ్వర్ అన్న' నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. కేసీఆర్‌ను ఆశీర్వదించేందుకు ప్రజలు పోటెత్తడంతో గులాబీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలం చేకూరినట్లైంది.

ఉర్రూతలూగించిన ధూంధాం

నృత్యాలు చేస్తూ సబ్బండవర్ణాల వారు సమూహాలుగా తరలివచ్చి సభా ప్రాంగణంలో సందడి చేశారు. ధూంధాం పాటలు సభికులను ఉర్రూతలూగించాయి. కళాకారుల బృందం ఆట పాటలు అలరించాయి. సభకు వచ్చిన ప్రజానీకానికి ఇబ్బందులు కలగకుండా గులాబీ శ్రేణులు అన్ని వసతులు కల్పించారు. దూరం నుంచి సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని వీక్షించేలా ఎల్ఈడీ స్క్రీన్లను బిగించారు. నలువైపులా నుంచి వచ్చే వాహనాల కోసం ఎక్కడికక్కడ ఆయా రూట్లలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

నేతల సమన్వయం...సభ సక్సెస్

సభ సక్సెస్ కావడంతో రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నేతలు చేసిన నేతల కృషి ఫలించింది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలంతా ఏకతాటిపై నిలిచి సభ సక్సెస్ అయ్యేందుకు దోహదపడ్డారు. సభ తేదీ ప్రకటించిన నాటి నుంచే నేతలంతా సమాలోచనలు జరపడమే కాకుండా.. ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సభ సక్సెస్‌కు తమవంతు పాత్ర పోషించారు. సభాస్థలం ఎంపిక నుంచి ఏర్పాట్లు, జన సమీకరణ అన్నింటిలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రెండు రోజులుగా వరుసగా సభాస్థలికి వెళ్లి దగ్గరుండి పరిస్థితులను సమీక్షించారు. జన సమీకరణ కోసం సన్నాహక సమావేశాలు సైతం నిర్వహించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాలవారీగా నేతలకు బాధ్యతలను అప్పగించారు. ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌ను ఆశీర్వదించాలని కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చారు.

• ఓట్లు గుద్దితే దెబ్బకు కాంగ్రెస్ దిగిరావాలె..

శనివారం చేవెళ్లలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు

• అంబేద్కర్ పుణ్యమే తెలంగాణ



చేవెళ్ల సభలో అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కేసీఆర్. చిత్రంలో పార్టీ నేతలు కర్నె ప్రభాకర్, బాలమల్లు తదితరులు

• రెండు లక్షల మెజార్టీ తగ్గొద్దమ్మా..!

చేవెళ్లలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో మాజీ మంత్రి సబితారెడ్డితో కేసీఆర్ మంతనాలు. చిత్రంలో పార్టీ నేత కార్తీక్‌రెడ్డి

• కదం కలిపిన కాలె యాదన్న..



చేవెళ్లలో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో ధూంధాం పాటలకు చిందేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి

• కరచాలనం చేద్దాం.. కాసానిని గెలిపిద్దాం



చేవెళ్ల బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో పార్టీ అధినేత కేసీఆర్‌తో స్వామిగౌడ్ కరచాలనం. చిత్రంలో చేవెళ్ల బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు

ఐఐటీల్లో కొత్త కోర్సులు

2024-25లో పెరగనున్న నాలుగు వేల సీట్లు

ఇండస్ట్రీ ఓరియంటెడ్ ప్రోగ్రామ్స్‌పై ఆఫర్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థలైన ఐఐటీలు కొత్త కోర్సులను అందుబాటులోకి తెస్తున్నాయి. 2024-25 విద్యాసంవత్సరంలో పలు కోర్సులను ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. కొత్త కోర్సులు, సీట్ల సంఖ్య పెంపుదలతో వచ్చే విద్యాసంవత్సరంలో 4 వేల వరకు సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నది. ఇంజినీరింగ్ ఫిజిక్స్ పేరుతో నూతన బీటెక్ డిగ్రీని ఐఐటీ తిరుపతి అందుబాటులోకి తీసుకురానున్నది. 2024-25 విద్యా సంవత్సరంలో 10 సీట్లతో ఈ కోర్సును అందుబాటులోకి తీసుకురానున్నారు. కోర్సుకు డిమాండ్‌ను బట్టి సీట్ల సంఖ్యను పెంచుతారు. క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును ఐఐటీ బాంబే ప్రవేశపెట్టనున్నది. ఇంటర్ డిసిప్లినరీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం కింద ఈ కోర్సును అందుబాటులోకి తీసుకొస్తారు. ఈ-మొబిలిటీ, మెడికల్ ఇంజినీరింగ్, సస్టెనబిలిటీ (సుస్థిరాభివృద్ధి) కోర్సులను ఐఐటీ మద్రాస్ వచ్చే విద్యాసంవత్సరం నుంచి అందుబాటులోకి తేనున్నది. ఐఐటీ మద్రాస్‌లో సస్టెనబిలిటీ (సుస్థిరాభివృద్ధి) కోర్సును మైనర్‌గా ప్రవేశపెట్టారు. జర్మనీ యూనివర్సిటీ సహకారంతో వాటర్ సెక్యూరిటీ అండ్ గ్లోబల్ చేంజ్ కోర్సునూ జాయింట్ మాస్టర్స్ ప్రోగామ్‌గా ప్రారంభించనున్నారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఇంటర్ డిసిప్లినరీ పీహెచ్‌డీ కోర్సుల్లో కొలాబరేటివ్ రీసెర్చ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంట్లో భాగంగా కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు ఎలక్ట్రానిక్స్ విభాగం వారితో కలిసి రీసెర్చ్ చేస్తారు.

ఐఐటీలు	నూతన కోర్సులు
ఐఐటీ బాంబే	క్వాంటం సైన్స్ అండ్ టెక్నాలజీ
ఐఐటీ మద్రాస్	ఈ-మొబిలిటీ, మెడికల్ ఇంజినీరింగ్, సస్టెనబిలిటీ (సుస్థిరాభివృద్ధి), వాటర్ సెక్యూరిటీ అండ్ గ్లోబల్ చేంజ్
ఐఐటీ తిరుపతి	ఇంజినీరింగ్ ఫిజిక్స్ (బీటెక్ డిగ్రీ)
ఐఐటీ హైదరాబాద్	డిసిప్లినరీ పీహెచ్‌డీ కోర్సుల్లో కొలాబరేటివ్ రీసెర్చ్

తగ్గనున్న కటాఫ్ మార్కులు

జాతీయ స్థాయిలోని ఐఐటీల్లో ఇప్పటివరకు 17,385 సీట్లు ఉన్నాయి. మరో 7,456 సీట్లు ఎన్ఐటీల్లో అందుబాటులో ఉన్నాయి. ఖరగ్‌పూర్‌లో 1,869, వారణాసిలో 1,589, బాంబేలో 1,356, రూర్కీలో 1,353, హైదరాబాద్‌లో 595 సీట్లు ఉన్నాయి. కొత్త సీట్లు చేరడంతో కటాఫ్ స్కోర్ తగ్గి, మరింత మందికి సీట్లు అందుబాటులోకి వస్తాయి.

కరెంట్ షాక్‌తో మరణిస్తే 5 లక్షలు పరిహారం

- **నెల రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి**
- **సంబంధిత పత్రాలన్నీ జతపర్చాలి**

హైదరాబాద్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు షాక్‌లతో మరణిస్తే ప్రభుత్వం రూ.5లక్షలు నష్టపరిహారం చెల్లిస్తుంది. చిన్నా, పెద్దా అన్న తేడాలేకుండా అందరికీ రూ.5 లక్షలు ఇస్తుంది. విద్యుత్తు స్తంభాలను ముట్టుకోవడం, స్టే వైర్ (పోల్ సపోర్ట్ తీగలు), విద్యుత్తు లైన్ల కింద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద సంభవించే మరణాలకు ఈ నష్ట పరిహారం అందజేస్తుంది. అలాగే వర్షాలు, గాలులతో తీగలు తెగి రోడ్ల మీద పడినప్పుడు చూడకుండా తొక్కి మరణించినా లేదా తీగల మీద నుంచి వాహనాలు వెళ్లడంతో మరణాలు సంభవించినా నష్టపరిహారం ఇస్తుంది. పంట పొలాల్లో కరెంటు తీగలు తగిలి మరణాలు చోటుచేసుకున్నా నష్టపరిహారం చెల్లిస్తుంది. ఒకవేళ పశువులు మరణించినా కూడా రూ.40,000 పరిహారాన్ని విద్యుత్తు శాఖ అందజేస్తుంది. అయితే శాఖ పరమైన తప్పిదం వల్ల ప్రమాదాలు చోటుచేసుకొని మరణాలు సంభవిస్తేనే పరిహారం చెల్లిస్తుంది. లేకుంటే ఇవ్వదు. ఉదాహరణకు ఇంట్లో అంతర్గత వైరింగ్ కారణంగా షాక్ తగిలి మరణం సంభవిస్తే పరిహారం అందజేయదు.

ఎలా దరఖాస్తు చేయాలంటే..

- కరెంటు షాక్ మరణం సంభవించిన నాటి నుంచి నెల రోజులలోపు అన్ని రకాల డాక్యుమెంట్లను జతచేసి దరఖాస్తు సమర్పించాలి.
- అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈ) ప్రాథమిక విచారణ జరుపుతారు. సంబంధిత డివిజినల్ ఇంజినీర్ (డీఈ) సమగ్ర విచారణ జరిపి పై అధికారులకు నివేదికను సమర్పిస్తారు.
- నష్టపరిహారాన్ని సంబంధిత డీఈ కార్యాలయం నుంచి పొందవచ్చు.

కావాల్సిన డాక్యుమెంట్లు..

పోలీసు ఎఫ్ఐఆర్, పంచనామా నివేదిక, డెత్ సర్టిఫికెట్, తాసిల్దార్ జారీచేసిన చట్టపరమైన వారసుల ధ్రువీకరణ పత్రం, సంఘటన ఫొటో, సంఘటన లోకేషన్.